## క్లుప్తంగా

### ఇంటర్ విద్యార్థులకు యూనిఫాం అందజేత



పెడన: మండలంలోని చెన్నూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలకు సోమవారం యూనిఫాంను బహూకరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ గుడిసేవ రమేష్ చేసిన సేవలకు గుర్తుగా స్థాపించిన జీఆర్సీ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు న్యాయవాది ప్రభాకరరావు, ముదినేపల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ, రమేష్ భార్య, కుమార్తెలు గుడిసేవ లక్ష్మీరాణి, తేజోధరణి తెలియజేశారు. ఇంటర్‌లో మొదటి ఐదు స్థానాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.10 వేలు అందజేస్తామని తేజోధరణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేష్, వెంకటేశ్వరరావు, హారిక, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే



పెడన: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమేనని పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ అన్నారు. మండలంలోని కొంకేపూడి సమీపంలోని సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూలులో వార్షిక క్రీడలను ఎస్ఐ రవిచంద్రకుమార్ పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువులో బాగా రాణించి క్రీడల్లో కూడా నైపుణ్యం సాధిస్తే త్వరితగతిన అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని విద్యార్థులకు ఎస్ఐ తెలిపారు. ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ పేర్లతో విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రేపు ఆక్వా జోన్ రీ సర్వేపై సమావేశం

కోడూరు: మండలంలో ఆక్వా జోన్ రీ సర్వే చేసే అంశంపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఫిషరీస్ ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా అధ్యక్షతన జరిగే సమావేశానికి గ్రామ, మండలస్థాయి వ్యవసాయ, ఇరిగేషన్, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు, సర్వేయర్లు హాజరు కావాలని కోరారు.

నాగాయలంక: మండలంలో ఆక్వాజోన్ రీసర్వేపై చర్చించేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు అవనిగడ్డ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వానపల్లి సత్యనారాయణ సోమవారం తెలిపారు.

### ఆర్థిక సాయం అందజేత



గూడూరు: జక్కంచర్ల ప్రాథమిక పరపతి సంఘం సభ్యుడు అల్లాభక్షు ఇటీవల మృతి చెందారు. అతని మట్టిఖర్చులకు సొసైటీ ఆధ్వర్యాన సోమవారం ఆర్థిక సాయం చేశారు. నూగూరులంకలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఆత్మూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీజీ లంక సర్పంచి రాహెతున్నిసా, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ కరీముల్లాలు మృతుడి భార్య నజీమున్నిసాకు రూ.10వేల నగదు అందజేశారు.

### విద్యార్థులకు ట్యాబుల పంపిణీ



గూడూరు: రాయవరం జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను సోమవారం గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో డిజిటల్ విద్యాబోధన అందించడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ట్యాబులు అందిస్తున్నారన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, నందం రవికిరణ్, తాతాజీ, బత్తిన త్రినాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వందే విష్ణుం భవ భయ హరం

### ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



బంటుమిల్లి వేంకటేశ్వరస్వామి



కోడూరులో ముక్కోటి విశిష్టత వివరిస్తూ ఏర్పాటు చేసిన రంగవల్లి

ఘంటసాల(అవనిగడ): శ్రీమహావిష్ణువు గరుడ వాహనదారుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిచ్చిన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విష్ణు నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. స్వామివారిని గరుడ వాహనంపై గ్రామాల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కెప్టెన్ లక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఏసీ చక్రధరరావు ఎమ్మెల్యేని పట్టు వస్త్రాలతో సత్కరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు అనంతరం ఎమ్మెల్యేకు ఆశీస్సులు అందించారు.

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని శ్రీగోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో సోమవారం ఉత్తర ద్వారం తెరిచి ప్రత్యేక పూజలు చేశారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ స్వామివార్లకు తొలిపూజలు చేశారు. గర్భాలయంలోని 11 అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణుడి విగ్రహానికి వజ్రవైఢూర్యాలతో పొదిగిన ఆభరణాలతో ప్రత్యేక అలంకారం చేశారు.

● కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విష్ణుమూర్తి పాలకడలిలో శేషపాన్పుపై లక్ష్మీదేవితో సేదతీరుతున్నట్లుగా చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం ఉల్లిపాలెం, కోడూరు ఆలయాల వద్ద గరుడవాహనంపై దేవేరులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు చేయగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, నరసింహపురంలోని రామాలయాల వద్ద భక్తులకు ముక్కోటి దర్శనం కల్పించారు.

మచిలీపట్నంటౌన్: రుస్తుంబాద శ్రీ భద్రాద్రి రామాలయానికి ఎమ్మెల్యే పేర్ని నాని సతీమణి జయసుధ వారి కుమారుడు, వైఎస్సార్ సీపీ నేత పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) విచ్చేసి పూజలు నిర్వహించారు. స్వామివారి పల్లకీసేవలో వారు పాల్గొన్నారు. జూపూడి మల్లికార్జునప్రసాద్, లక్ష్మీకీర్యాణి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో గోవాడ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు. బచ్చుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, జగన్నాథపురంలోని జగన్నాథస్వామి, చల్లరాస్తా సెంటరులోని వేణుగోపాలస్వామి ఆలయం, నిజాంపేట బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయం, యతిరాజ భవనం, చిలకలపూడి పాండురంగ స్వామి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.



ఎమ్మెల్యే దంపతులకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు



ఉల్లిపాలెంలో గరుడవాహనంపై స్వామివారు దేవేరులు



భద్రాద్రి రామాలయంలో పల్లకీ మోస్తున్న పేర్ని కిట్టు

బంటుమిల్లి: బంటుమిల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. రామాలయంలో వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులను ఉత్తరాభిముఖంగా ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణలతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. సాయంత్రం గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్. రాజ, జె. వాసు, యూపీఆర్ విఠల్, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పెదతుమ్మిడి, అర్తమూరు గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ముక్కోటి పూజలు చేశారు.

పెడన: స్థానిక శ్రీరుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలస్వామి సోమవారం ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ, పాలకవర్గం సౌజన్యంతో పరాశరం కృష్ణప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో అగ్నిహోత్రం హరికృష్ణ ముక్కోటి పూజా కార్యక్రమాలను చేశారు. సోమవారం సాయంత్రం కల్యాణోత్సవం చేశారు. మంగళవారం మహాసుదర్శన హోమం ఉదయం 8.30 గంటలకు చేస్తారని, 11 గంటలకు మహాపూర్ణాహుతి జరుగుతుందని అర్చకులు తెలిపారు.

గూడూరు: గూడూరులోని గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, రాజ్యలక్ష్మీ సమేత నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత మాధవస్వామి, వెంకటాచల స్వామి, సీతారామ స్వామి దేవాలయాల్లో ఉత్సవమూర్తులను గరుడ వాహనాలపై పురవీధుల్లో ఊరేగించారు.

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు శ్రీ మద్విరామ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెదకళ్లేపల్లి శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆలయ ప్రధానార్చకులు సత్య కృష్ణమాచార్యులు స్వామివారిని విశేషంగా అలంకరించారు.

కృత్తివెన్ను: మండలంలో లక్ష్మీపురం వేంకటేశ్వర స్వామి, కృత్తివెన్ను శివాలయంలోని సత్యనారాయణస్వామి ఆలయాల్లో స్వామివారిని భక్తులు ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక గరుడ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచారి ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు నూజెళ్ల బాబు, బొందలపాటి వెంకటేశ్వరరావు, ఉప్పాల ఏడుకొండలు, మోపిదేవి ద్వారకానాథ్, పత్రి హనుమంతరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### సమన్వయంతో పని చేయండి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ ప్రతిష్ట పెంచాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కోరారు. సోమవారం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లకు వలంటీర్లతో పరిచయ కార్యక్రమం, నూతన పింఛన్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దళారీలను ప్రోత్సహిస్తే, సీఎం జగన్ ఎలాంటి రాజకీయ సిఫార్సులకు తావు లేకుండా సంక్షేమ పథకాలు, పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ అధికార దాహం, పబ్లిసిటీ పిచ్చితో పుష్కరాల్లో 29మందిని, కందుకూరులో తొమ్మిది మందిని, గుంటూరులో ముగ్గురిని బలి తీసుకున్నారన్నారు. అనంతరం మండలంలో మంజూరైన 184 పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, సర్పంచ్‌లు నడకుదుటి ఆదిలక్ష్మి, కొల్లూరి కోటేశ్వరరావు, డొక్కు నాగేశ్వరరావు, గొరిపర్తి సురేష్ బాబు, తోట శ్రీనివాసరావు, వల్లూరు ఉమా, ఎంపీటీసీలు నూకల వెంకటేశ్వరరావు, డొక్కు దేవేంద్రరావు, మహమ్మద్ షాహెదా బేగం, పీఏసీఎస్ చైర్మన్లు శీరం వెంకట సత్యన్నారాయణ (నానీ), పాగోలు నాగ సీతారామారావు (ఫణి) తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీఓకు అభినందనలు

పామర్రు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పామర్రులోని పలుశాఖల అధికారులను కలిసి శుభాకాంక్షలను తెలిపామని పామర్రు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం, రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ తదితర అధికారులను కలిసి సోమవారం పుష్పమాలలతో అభినందించారు. సంఘ సభ్యులు ఎంఆర్‌కె. ఆచార్యులు, నందిపాటి నాగిరెడ్డి, కె.వీరయ్య, భీమవరపు శివ శేషమణి, జి.పోలు రాజు, అచ్చియ్య, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మనసున్న ముఖ్యమంత్రి జగన్

### పింఛన్ల పంపిణీలో నేతలు

మచిలీపట్నంటౌన్: అర్హులకు వివిధ పింఛన్లు అందిస్తూ వారి అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసున్న ముఖ్యమంత్రి అని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కొనియాడారు. నగరంలో జనవరి నుంచి పింఛను పొందడానికి అర్హులైన 732 మంది పెన్షనర్లకు సోమవారం నగదును అందజేశారు. నగరంలోని రాజుపేట షాదీఖానాలో 25 డివిజన్ నుంచి 40వ డివిజన్ వరకు 254 మందికి, టౌన్ హాలులో 13, 15 నుంచి 24వ డివిజన్ వరకు 168 మందికి, బైపాస్‌రోడ్డులోని వాసవీ కళ్యాణ మండపంలో 1, 41 నుంచి 50వ డివిజన్ వరకు 154 మందికి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో 14, 2 నుంచి 12వ డివిజన్ వరకు 156 మంది లబ్ధిదారులకు పింఛన్ మొత్తాలను మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదాలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ నగరంలో 732 మందికి రూ. 20,51,750 అందజేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలు, పార్టీలకు సంబంధం లేకుండా అర్హతే గీటురాయిగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవితథామస్‌నోబుల్, లంకా సూరిబాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు శ్రీకాకోళపు రేణుకారాణి, జవ్వాది రాంబాబు, కో-ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసీ, పలు డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

కోడూరు: ఈ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ నగదును రూ.2750 పెంచడంతో వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని పెన్షనర్లకు వీటిని అందిస్తున్నారు. సచివాలయాలకు నూతనంగా నియమితులైన కన్వీనర్లు, వలంటీర్ల సమన్వయంతో వీటి పంపిణీ చేస్తున్నారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో ఉదయం 6గంటల నుంచే పెన్షన్లు అందించడం ప్రారంభించారు. మంగళవారం మండలంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పెన్షన్ల పంపిణీ నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ తెలిపారు.



వృద్ధుడికి పింఛను పంపిణీ చేసిన పేర్ని కిట్టు చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ, సలార్‌దాదా



ముక్కొల్లులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న సర్పంచి సమ్మెట జయవర్ధన్



చినగుడుమోటులో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్

గూడూరు: పెన్షన్ల పంపిణీ చారిత్రాత్మకమని సర్పంచుల సంఘం గూడూరు మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ అన్నారు. ముక్కొల్లులో నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎంపీటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగర పాలక సంస్థ రెండోస్థానంలో నిలిచింది. నగరంలో మొత్తం 18,690 పింఛన్లు ఉండగా 17,917 మందికి అందజేసి 95.86 శాతం పంపిణీ చేశారు. 32వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చింతా మౌనిక, వలంటీర్ బీరం మౌనిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కూతాడి బసవపున్నయ్యకు పింఛను సొమ్ము అందజేశారు. ఆంధ్రా ఆస్పత్రిలో కాలికి గాయమై చికిత్స పొందుతున్న ముచ్చర్ల సత్యనారాయణప్రసాద్‌కు అక్కడకు వెళ్లి పింఛను మొత్తాన్ని వలంటీర్ శివపార్వతి అందజేశారు. నగరంలోని ఆర్‌సీఎం వృద్ధాశ్రమంలో వృద్ధులకు 10వ డివిజన్ వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



పెదప్రోలులో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు పంచాయతీ పరిధిలో ప్రశాంతి నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ అభిమాని గంటా కిషోర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం యువకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ఆది రాంబాబు రూ. 5 వేలు సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, వై.శ్రీనివాసరావు, డి.సుమన్, లక్ష్మయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, తలగడదీవి హైస్కూలు అభివృద్ధి కమిటీ చైర్మన్ వర్రే రాంబాబును ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం పరామర్శించారు. ఇటీవల తలగడదీవిలో ఆయన సోదరుడు వర్రే గణేశ్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకుని వచ్చిన రమేష్‌బాబు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట లక్ష్మణ్, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

అవనిగడ్డ: వేకనూరు జెడ్పీహైస్కూల్ హెచ్ఎం రవీంద్రని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం పరామర్శించారు. రవీంద్ర పెద్ద కుమార్తె అన్నపరెడ్డి శ్రావ్య అనారోగ్యంతో సోమవారం మరణించారు. ఎమ్మెల్యే సింహాద్రి నివాళులర్పించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోడూరు: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని బందరు డీఎల్‌డీఓ జి.పద్మ అన్నారు. కోడూరు, ఉల్లిపాలెం సచివాలయాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు తప్పకుండా బయోమెట్రిక్ హాజరును నమోదు చేయాలని, ఫీల్డ్ విజిట్‌కు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని డీఎల్‌డీఓ ఆదేశించారు. వలంటీర్లు కూడా సచివాలయాలకు వచ్చి గ్రామస్థాయిలో సమస్యలను ఉద్యోగులకు తెలపాలన్నారు. పథకాలకు సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాలను కార్యాలయం బయట ప్రదర్శించాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ఎరువు తయారీ ప్రక్రియపై కూడా అవగాహన ఉండాలన్నారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కోడూరు ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది డీఎల్‌డీఓను సన్మానించి, జ్ఞాపిక అందించారు.

### ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

నాగాయలంక: స్థానిక పీఎస్ పరిధిలోని నాగాయలంకలో అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ నల్లూరి వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి తెలిపారు. స్థానిక ఏడో వార్డుకు చెందిన చిక్కాల నాగరాజు(48)ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. గ్రామస్తుడు అగ్రవర్ణాలకు చెందిన సబ్బినేని అనిల్‌కుమార్ ఈ నెల 1వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో నాగరాజుతో గొడవపడి చేతులతో కొట్టి కులం పేరుతో దూషించి చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

### బందరు సబ్-డివిజన్‌లో 30 పోలీస్‌యాక్టు

కోనేరుసెంటర్: బందరు సబ్-డివిజన్‌లో ఈ నెల 18వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్‌యాక్టు అమలుచేస్తున్నట్లు బందరు డీఎస్పీ మాసూంబాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 28నుంచే 30 పోలీస్‌యాక్టు అమలులోకి వచ్చిందని సంక్రాంతి పురస్కరించుకుని యాక్టు అమలును మళ్లీ అమలుచేస్తున్నామని పేర్కొన్నారు. సబ్-డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా, అసాంఘిక చర్యలకు పాల్పడినా, నలుగురు కంటే ఎక్కువ సంఖ్యలో ఒకేచోటుకు చేరినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, నిరసన దీక్షలు, బహిరంగ ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించకూడదని పేర్కొన్నారు.

# నిరుపేదలను రైతులుగా మార్చడమే లక్ష్యం

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరుపేదలను రైతులుగా మార్చాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పెదపట్నం సర్పంచ్ గడిదేశి అనూష అన్నారు. పెదపట్నంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సభలు నిర్వహించడంతో గ్రామస్తుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని పంచాయతీ అభివృద్ధికి చక్కటి ప్రణాళిక రూపొందించుకోవచ్చునన్నారు. పెదపట్నంలో 2021కు సంబంధించి వైఎస్సార్ ఆసరా నుంచి చేయూత వరకు 21 సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం వ్యక్తిగత ఖాతాల్లోకి రూ5.20కోట్లకుపైగా జమ చేశారన్నారు. ఇప్పటి వరకు గ్రామ అభివృద్ధికి పది కోట్లతో కలిపి దాదాపు ఇరవై ఏడు కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసినట్లు ఆమె చెప్పారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో రూ.3.27 కోట్ల మంజూరు చేశారన్నారు. కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ బాలయేసు మాట్లాడుతూ సీఎం రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, మాజీ సర్పంచ్ ఇంతేటి మరియన్న, పంచాయతీ గౌరవసలహాదారుడు గడిదేశి రాజు, ఉపసర్పంచ్ బోయిన సాయిగీత, కార్యదర్శి శ్రీహరిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బంటుమిల్లి: పెందుర్రు వాసి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుడు ప్రత్తి నాగవెంకటరమణ(40) గతేడాది డిసెంబరు 31రాత్రి ద్విచక్ర వాహనంపై బంటుమిల్లి నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. పెందుర్రు సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. ఆరబెట్టిన ధాన్యం ప్రమాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంకటరమణను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రమణ సోమవారం మరణించాడు.

### బడ్డీ దగ్ధం

పాతమాజేరు (చల్లపల్లి): పాత మాజేరులో గ్యాస్ సిలిండర్ లీకై బడ్డీ కొట్టు పూర్తిగా కాలిపోయింది. సోమవారం సాయంత్రం గ్రామస్తుడు కమ్మిలి రజనీకాంత్ తన బడ్డీలో అల్పాహారం వండుతుండగా, వంట గ్యాస్ లీకై భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఫ్రిజ్ మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న మచిలీపట్నం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసి నష్టం పరిశీలించారు.

### ● సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు







సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం బందరు ఎంపీ బాలశౌరి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేత గరికపాటి శివ ఉన్నారు. బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసిన మచిలీపట్నం మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. -చిలకలపూడి/కోనేరుసెంటర్